

# భిన్నత్వంలో ఏకత్వం

భిన్నధ్రువాలు ఆకర్షించుకుంటాయన్న భౌతిక శాస్త్ర నియమానికి పార్వతీపరమేశ్వరులు ఉదాహరణగా కనిపిస్తారు. వారిద్దరి రూపాలు పరిశీలిస్తే చాలా వ్యత్యాసం కనిపిస్తుంది. కానీ, మనసులు మాత్రం ఒకటే! ఇద్దరి రూప లావణ్యాలు, గుణగణాలూ వర్ణిస్తూ.. ఆదిశంకరులు అందించిన 'అర్ధనారీశ్వర స్తోత్రం' ఇదే విషయాన్ని స్పష్టం చేస్తుంది.

**చాంపేయగౌరార్ధ శరీరకాయై కర్పూరగౌరార్ధ శరీరకాయ।**
**ధమ్మిల్లకాయై చ జటాధరాయ నమః శివాయై చ నమః శివాయ॥**

'ఒకవైపు సంపెంగ పువ్వులా స్వర్ణకాంతులతో మెరిసిపోతున్న అమ్మ, మరోవైపు తెల్లని కర్పూర కాంతితో వెలిగిపోతున్న శివయ్య, ఒకవైపు సుందరమైన కొప్పు కలిగిన పార్వతీదేవి, మరోవైపు జడలు కట్టిన జటాజూటము కలిగిన పరమేశ్వరుడు... ఆహా భిన్నరూపులు ఏక రూపమైన అర్ధనారీశ్వరునికి నమస్కరిస్తున్నాను' అని అర్ధనారీశ్వర స్తోత్రంలోని ఓ శ్లోకం విశదీకరిస్తుంది.

అంతలోనే 'అల్లదిగో శివుడు' అన్నాడు. కాబోయే అత్తగారి ఆరాటం అర్థమైంది శివుడికి. ఒక్కసారిగా తన రూపురేఖల్ని వికారంగా మార్చేసుకున్నాడు. తన గణాలనూ అలాగే మారమన్నాడు. ఆయనగారి రూపం చూసి కుదేలైంది మేనకాదేవి. నారదుణ్ని తూర్పారబట్టింది. సప్తరుషులనూ పిలిచి 'నా పిల్ల గొంతుకోశారు మీరంతా' అని వగచింది. బ్రహ్మ చెప్పినా వినలేదామె. పార్వతీదేవి వచ్చి శివతత్త్వం గొప్పదనం చెప్పినా పట్టించుకోలేదు సరికదా! కూతురుకు చీవాట్లు పెట్టి.. కొట్టినంత పని చేసింది. చివరికి నారాయణుడు వచ్చి శంకరుడు లోక వశంకరుడు అని చెబితే కాస్త స్థిమితపడింది. ఇంతలో నారదుడు వెళ్లి.. 'ఏమిటీ పంచముఖాలు... ఎందుకీ వికార అవతారం' అని శివుణ్ని ప్రశ్నించాడు. 'అత్తగారికి నా తత్త్వం ఎరుక చేయడానికి' అని ముసిముసిగా నవ్వాడు. 'ఇదేం ఆనందం స్వామీ! మళ్లీ ముస్తాబై రండి' అనగానే.. సమ్మోహన రూపం దాల్చి పెళ్లింట అడుగుపెట్టాడు శివుడు. అంగరంగ వైభవంగా శివపార్వతుల కల్యాణం జరిగింది. పురుషుడి స్పర్శతో ప్రకృతి పరవశించింది. ప్రకృతి ఒడిలో పురుషుడు పులకాంకితుడయ్యాడు.

ఆ తల్లికి తన శరీరంలో సగమిచ్చి మళ్లీ విడిపోకుండా ముడివేశాడు శివుడు. తనువులో సగమే ఆక్రమించినా.. మనసునంతా నిండిపోయిందామె. బాహ్య దృష్టిలో అర్ధనారీశ్వరం. ఆంతర్యం గ్రహిస్తే.. ఇద్దరూ ఒక్కటే! భార్యాభర్తలు వేరు కాదని శివుడు చెప్పిన సత్యం.. అతి సుందరం. అభిప్రాయభేదాలు వచ్చినా... అలకలు పూనినా.. ఆగ్రహాలకు గురైనా.. కుంగుబాటుకు లోనైనా.. ఒకరికొకరు సర్దిచెప్పుకొని ముందుకు సాగిపోవడమే దాంపత్య రహస్యం. ఆది దంపతులు మనకు అందించిన సందేశం.

ఈ ఇరువురూ ఇలా విడిపోవడం దేనికి? మళ్లీ కలవడం దేనికి? అదే సృష్టి రహస్యం. దక్ష పుత్రికగా ఉండొద్దనుకుంది అమ్మ. అందుకే శరీరాన్ని త్యజించింది. మళ్లీ ఇద్దరూ కలిస్తేనే... కుమార సంభవం సంభవమవుతుంది. అది సాధ్యమైతేనే తారకాసుర సంహారం జరుగుతుంది. అందుకే పార్వతిగా పుట్టింది అమ్మ. పరమేశ్వరుణ్ని చేపట్టింది. వాగర్థాలు మళ్లీ ఒక్కటయ్యాయి. జగత్తుకు అమ్మానాన్నల అండ దొరికింది. ఈ శివరాత్రి సందర్భంగా మనువాడుతున్న గౌరీశంకరులు.. మునుపటి ముచ్చట్లు నెమరువేసుకుంటూ మురిసిపోతుంటారేమో! ఒకరినొకరు మళ్లీ మచ్చిక చేసుకుంటారేమో!! వారి కాపురాన్ని ఆదర్శంగా తీసుకొని ఆదిదంపతులు అభిమానించే జంటగా మారడమే మనం వారికి చెల్లించే మొక్కు.

## అది నేనే..



ఒకసారి ఇంద్రాది దేవతలు శివుణ్ని స్తుతిస్తూ 'స్వామీ! పుట్టుకకు కారణమైన మన్మథుణ్నీ నువ్వు మట్టుపెట్టావు. మరణానికి కారణమైన యముణ్నీ తుద ముట్టించావు. జననమరణ చక్రం నుంచి జీవుణ్ని బయటపడేసి... మోక్షం ప్రసాదించే దేవుడివి నువ్వే' అని కీర్తించారట. పక్కనే ఉన్న పార్వతి.. 'అందులో నా వాటా కూడా ఉంది' అన్నదట. అర్థం కాలేదట దేవతలకు. 'మన్మథుణ్ని భస్మం చేసిన త్రినేత్రం శివుడి ఫాల భాగంలో కదా ఉంది. సగం ఆయన వైపు ఉంటే.. సగం నా వైపు ఉందిగా!' అన్నదట. ఔనన్నట్టు తలూపారట దేవతలు. 'యముణ్ని తాడనం చేసిన ఎడమ పాదం.. నాదేగా! ఆయన శరీరంలో ఎడమ భాగంలో ఉన్నది నేనేగా' అన్నదట అమ్మవారు. సృష్టి, స్థితి, లయ, తిరోధానం, అనుగ్రహం ఈ ఐదూ శివుడి పనులే! సృష్టి, స్థితి పార్వతీదేవి చూసుకుంటే, లయ, తిరోధానం శివుడు చూసుకుంటాడట. అనుగ్రహం (ముక్తి) మాత్రం ఇద్దరూ ఇస్తారట. ఇక్కడ కూడా అర్ధనారీశ్వర తత్త్వమే! శివుడు ఏం చేసినా పార్వతి చేసినట్టే! పార్వతి ఏం అనుగ్రహించినా శివుడు ఇచ్చినట్టే. శివ భక్తులను పార్వతి కటాక్షిస్తే... అమ్మవారి ఆరాధకులను శివుడు కాపు కాస్తుంటాడన్నమాట.